మినీ కథ:

# యూఫూల్

ములుకుట్ల రవి



ప్రేమలేఖ వ్రాయడంఎంత కష్టమో తెలిసొచ్చిందిశేఖర్ కి "హుఁ! ఏప్రిల్ ఫూల్ చేయడానికి రాయడమే ఇంతకష్టంగావుంటే ఇంక నిజంగా ప్రేయసికి రాయడం ఎంత కష్టమో" నిట్టూర్చి అనుకున్నాడు.

"హమ్మయ్యా లెటర్ పూర్తి అయింది. మూర్తిగాడికి పోస్ట్ చేయాలి" అనుకుంటూ దానిని బల్లమీద పెట్టి మూర్తి ఎడ్రస్ రాసి దానిని అంటించడానికి జిగురు తెచ్చి అంటించి పోస్ట్ చేసాడు.

* * *

మర్నాడు మూర్తికి ఒక లెటర్ వచ్చింది. చించి చూసాడు. తనని ప్రేమిస్తున్నానని ఒక అమ్మాయి రాసిన ప్రేమలేఖ.

"డియర్ మూర్తీ,

ఎన్నాళ్ళనించో మిమ్మల్ని గమనిస్తున్నాను. నన్ను మీరు చూసి ఉండరు కాని మీకు రోజూ కనబడుతున్నదానినే. మీరంటే ఎందుకో నాకు చాలాయిష్టం. ఎప్పటినుంచో ఈ లెటర్ రాయాలని అనుకుంటున్నాను. కాని మీరేమైనా తప్పుగా అర్థం చేసుకుంటారని భయపడేదాన్ని.

ఈ రోజు ధైర్యం చేసి రాస్తున్నాను. నన్ను వేరే విధంగా అనుకోవద్దు.

సదా మీ ప్రేమనుకోరే. పద్మ-

లెటర్ పూర్తిగా చదివాడు మూర్తి "ఎవరబ్బా ఈ పద్మ. నాకు తెలిసినంతవరకు ఆ పేరుగల వారెవరూ లేరే! అసలు నిజంగా పద్మ అనే అమ్మాయి రాసిందేనా? లేకపోతే తనని ఫూల్ చేద్దామని ఎవరైనా రాసారా?" ఇట్లా ఆ లెటర్ సుందరి ఎవరో తెలియక జుట్టు పీక్కోసాగాడు మూర్తి.

కాసేపాగి లెటర్ వంక పరీక్షగా చూసాడు. అంతే అతని బుర్రలో మెరిసింది ఒక ఆలోచన.

* * *

శేఖర్ వచ్చాడు మూర్తి రూమ్ కి. అప్పటికే దేవదాసు ముఖం పెట్టేశాడు మూర్తి. గడ్డం గీసుకోలేదు. స్నానంకూడా చేయలేదు.

చేతిలో లెటర్ ఉంచుకుని తనలో తాను గొణుక్కోసాగాడు మూర్తి.

"ఏమిట్రా మూర్తీ అలా ఉన్నావు" అడిగాడు శేఖర్ వచ్చే నవ్వు ఆపుకుంటూ.

అతని సమాధానం వినకుండానే మూర్తి చేతిలోనుంచి ఆ పేపర్ లాక్కుని ఆశ్చర్యంగా మొహం పెట్టి "ఏమిట్రా ఇది" అన్నాడు శేఖర్.

"చదవరా. చదివి ఎవరు రాసారో ఆ లెటర్ కాస్త ఆలోచించు" నూతిలో నుంచి వచ్చినట్టువచ్చాయి మూర్తిమాటలు.

"ఆఁ! తను రాసిందేగా" అని యథాలాపంగా చూసి కింది సంతకం చూసాడు. షాక్ తగిలినట్టు ఉలిక్కిపడ్డాడు "ఏమిటి సంతకం మారిపోయిందే. తను పద్మ అని సంతకంచేస్తే పద్మిని ఎలాగైంది" అనుకొని పరీక్షగా చూసాడు. దిద్దినట్టుంది.

"పద్మిని ఎవరు? తన చెల్లెలు కాదు కదా? కాదుకదా ఏమిటి 'పద్దు'యేరాసింది' చచ్చేటంత కోపమొచ్చేసింది శేఖర్ కి.

"అది మొన్ననే ఇంటర్ రాసింది. దానికింత తెగింపా. తనేదో సరదాగా మూర్తిని ఫూల్ చేద్దామని లెటర్ రాస్తే ఇలా సంతకాన్ని దిద్దుతుందా.' మనస్సులోనే మండిపోయాడు శేఖర్.

"నే వస్తానురా" అంటూ లేచాడు సీరియస్ గా శేఖర్.

* * *

ఇంటికి వచ్చాడు శేఖర్.

"అమ్మా పద్దు ఎక్కడికి వెళ్ళింది?" విసురుగా అడిగాడు. "ఇప్పుడే తన స్నేహితురాలు రమట వాళ్ళింటికెళ్ళిందిరా. ఎందుకు?" అడిగింది ఆవిడకి విషయం అర్థంగాక.

మనసు పనిచేయడం లేదు శేఖర్ కి. ఏమేమో చేసేయాలనుంది. పిడికిళ్ళు బిగించి పళ్ళు పటపట కొరకసాగాడు.

తను గమ్ తీసుకురావడానికి లోపలికి వెళ్ళగానే పద్దు సంతకం మార్చేసింది అనుకున్నాడు. మరోసారి మళ్ళీ రోడ్డు మీదికి వచ్చేసాడు బుర్ర పనిచేయక.

కొది దూరంలో మూర్తి! వాడ్ని చూస్తే చంపేయాలనిపించింది. దగ్గరకి వచ్చాడు మూర్తి.

"ఏంట్రా అలా ఉన్నావేం?" అడిగాడు మూర్తి చిరునవ్వుతో.

"ఒరేయ్ నువ్వు ఇంత మోసగాడివని ఊహించలేదురా. బ్రదర్! అంటూనే నా చెల్లెలితో ప్రేమాయణం మొదలుపెడతావా" ఆవేశంగా అన్నాడు శేఖర్.

"ఏంటిరా నువ్వు మాట్లాడేది నాకర్థం కావడంలేదు" కొశ్చన్ మార్కు మొహం పెట్టి అడిగాడు మూర్తి.

"ఏమిటా" అని తను ఇందాకజాగ్రత్త చేసినలెటర్ మూర్తి మొహంమీద కొట్టాడు శేఖర్.

అదిచూసి మూర్తి పకపకా నవ్వి—

"ఒరేయ్ బడుద్ధాయ్! ఈరైటింగ్ ఎవరిదో పోల్చుకోలేను అనుకున్నావా? నువ్వు నన్నేదో ఫూల్ చేద్దామని ప్రేమలేఖ రాసి పోస్ట్ చేసావు. నేను నిజంగా ఫూల్ నయ్యాను కాసేపు. కాని ఆలోచించగానువ్వు చేసిన వెధవపని ఇదని అర్థం అయింది.

"మరి నన్ను ఫూల్ చేసిన నిన్ను నేను ఫూల్ చేయద్దా. నిన్ను కాసేపు ఏడిపిద్దామనుకున్నాను. నాకు తెలుసు నువ్వు ఫస్ట్ నాడు పరామర్శించడానికి వస్తావని. అందుకనే ఆ పద్మ అని ఉన్న ఆ సంతకాన్ని పద్మినిగా మార్చాను. నాకు తెలుసురా. అది మీ చెల్లాయ్ పేరని. బట్ జస్ట్ నిన్ను ఫూల్ని చేద్దామని అలా దిద్దాను.

"నేను అనుకున్నట్టే నువ్వు ఎవ్వరికీ చెప్పుకోలేక మాగిపోయావు. అంతేకాని నీ చెల్లాయ్ నాకు చెల్లాయేరా" భుజం మీద చెయ్యి వేసి అన్నాడు మూర్తి.

స్థాణువై పోయాడు శేఖర్.